పండ్లకు భలే గిరాకీ

పరిగి, మార్చి 7: మహాశివరాత్రిని పురస్కరించుకొని పండ్లకు భలే గిరాకీ ఏర్పడింది. ఉపవాస దీక్ష చేపట్టే భక్తులు పూజల అనంతరం పండ్లు స్వీకరిస్తారు. దీంతో మహాశివరాత్రి పండుగకు పండ్లకు మంచి గిరాకీ ఉంటుంది. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం ఉండగా గురువారం పరిగి పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులకు ఇరువైపులా పండ్ల దుకాణాలు వెలిశాయి. పరిగి పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు పరిగిలోనే పండ్లు కొనుగోలు చేయడంతో పండ్ల దుకాణాలు కళకళలాడాయి.

గిరిజనులపై దాడి చేసిన ఎస్ఐపై
చర్యలు తీసుకోవాలి

వికారాబాద్ ఎస్పీకి ప్రజా సంఘాల ఫిర్యాదు

వికారాబాద్, మార్చి 7 : గిరిజనులపై అకారణంగా దాడి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ప్రజాసంఘాల నాయకులతో కలిసి వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొంరాస్‌పేట మండలంలోని మూడుమామిళ్లతండాకు చెందిన దశరథ్, గోపాల్‌నాయక్, నిలేశ్‌నాయక్‌లపై కొడంగల్ ఎస్ఐ భరత్‌రెడ్డి సేవాలాల్ మహారాజ్ జయంతి నాడు అకారణంగా దాడి చేశారన్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన వారిలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గో విండ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు సంజూనాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మోహన్, రాష్ట్ర అధికార ప్రతినిధి రవీనాయక్, పరశురాంనాయక్, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

వికారాబాద్, మార్చి 7 : పాఠశాలకు వెళ్లాలని తల్లి మందలించడంతో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ పట్టణంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ పట్టణం మద్గుల్ చిట్టంపల్లికి చెందిన ధన్నారం శ్రీవాణి (14) ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. శ్రీవాణి తండ్రి గతం లోనే మరణించడంతో తల్లి ఇద్దరు పిల్లలను వ్యవసాయం చేస్తూ చదివి స్తున్నది. శ్రీ వాణి తమ్ముడు అదే పాఠ శాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం శ్రీవాణి పాఠ శాలకు వెళ్లాలని తల్లి మందలించడంతో ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా ఈ విషయంపై ఫిర్యా దు అందలేదని పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాలు.. ఐదు గురికి గాయాలు

పెద్దేముల్, మార్చి 7 : మండల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదు గురు గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. జనగాం గ్రామానికి చెందిన నారవోని శ్రీను (35) బైక్‌పై జనగాం నుంచి నాగసముందర్‌కు వెళ్తున్నాడు. మండల పరిధిలోని మారేపల్లి శివారులో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని తాండూరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

మరో ప్రమాదంలో..

ఓ ఆటోలో ఐదు గురు ప్రయాణికులు తాండూరు నుంచి నాగసమందర్‌కు వెళ్తున్నారు. పెద్దేముల్ గ్రామ శివారులోకి రాగానే పెట్రోల్ పంపు ఎదుట ఉన్న గుంతను తప్పించబోతున్న సమయంలో ఎన్నారం గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వేగంగా వస్తున్న క్రమంలో అదుపు తప్పడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో బైకిస్టుతో పాటు ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు క్షతగాత్రులను తాండూరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

పరిగి, మార్చి 7 :ఇంటిపన్ను బకాయిలపై పెనాల్టీలో రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ సూచించారు. 2022-23 వరకు గల ఇంటిపన్ను బకాయిలపై పెనాల్టీలో ప్రభుత్వం 90శాతం రాయితీ సదుపాయం కల్పించిందని అన్నారు. అందువల్ల పరిగి పట్టణ ప్రజలు ఇంటిపన్ను బకాయిలు చెల్లించి పెనాల్టీపై రాయితీని పొందాలన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో ప్రస్తుత సంవత్సరం పన్ను చెల్లించిన వారికి 5 శాతం రిబేట్ కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్, వార్డు ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

పారామిలిటరీ దళాల కవాతు

పరిగి టౌన్, మార్చి 7: ప్రజలకు భద్రత కల్పించం కోసమే పారామిలిటరీ సిబ్బందితో కవాతు నిర్వహించినట్లు డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం పరిగిలో పారా మిలిటరీ దళాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, ఎస్సై సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి
ముస్తాబైన శివాలయాలు



కులకచర్ల: విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న పాంబండ ఆలయం

బొంరాస్‌పేట, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినానికి మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రానికి సమీపంలో పెద్ద చెరువు వెనుక ఉన్న పురాతన శ్రీ సంగమేశ్వర దేవాలయం, నాగిరెడ్డిపల్లి గ్రామానికి సమీపంలోని పరమేశ్వరగుట్టపై వెలసిన శ్రీ పరమేశ్వర దేవాలయాలు ఏటా శివరాత్రికి భక్తులతో కిటకిటలాడుతుంటాయి. శివరాత్రి పండుగ రోజు మండలంలోని బొంరాస్‌పేట, తుంకిమెట్ల, మెట్లకుంట గ్రామాలతో పాటు పరిగి, కొడంగల్ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు సంగమేశ్వర దేవాలయానికి వచ్చి శివుడికి అభిషేక పూజలు చేస్తారు. ఉపవాస దీక్షలు ఉన్న భక్తులు రాత్రికి దేవాలయంలో భజనలు చేస్తారు. నెల రోజుల కిందటే దేవాలయానికి సున్నం వేసి శివదీక్షలు చేపట్టిన బొంరాస్‌పేట గ్రామానికి చెందిన భక్తులు దేవాలయంలోనే నిత్యం పూజలు చేస్తున్నారు. దేవాలయం దగ్గర నీటి వసతి ఉంది. అదేవిధంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి సమీపంలోని శ్రీ పరమేశ్వర దేవాలయం కూడా శివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. దాతల సహకారంతో దేవాలయం వద్ద బోర్లు వేసి నీటి సౌకర్యం కల్పించారు. దుద్యాల మండల కేంద్రంతో పాటు బొంరాస్‌పేట మండలంలోని రేగడిమైలారం, మెట్లకుంట, తుంకిమెట్ల తదితర గ్రామాల్లోని శివాలయాలను శివరాత్రి పర్వదినానికి ముస్తాబు చేస్తున్నారు.

కులకచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు పాంబండపై నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు మండల ప్రజలతో పాటు చుట్టు పక్కల మండలాల ప్రజలు, ఇతర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. పాంబండపై స్వయాన శ్రీరాముడు నెలకొల్పిన శివలింగం కావడంతో రామలింగేశ్వర స్వామి అని పిలుస్తారు. ఆలయం ముందు రాతి గుట్టపై గుండం ఉండడం, అందులో ఎప్పుడూ నీళ్లు ఉండడం విశేషం. పాంబండ కిలోమీటర్‌కు పైగా ఆవరించి ఉంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. ఆలయాలను వివిధ దీపాల కాంతులతో అలంకరించారు. పాంబండ రామలింగేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ రాములు, ఈవో సుధాకర్ తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నామన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్‌లో శివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు పూజారి మఠం రాజశేఖర్ తెలిపారు. గ్రామంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొడంగల్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. పట్టణంలోని మహాదేవుడి ఆలయం, పట్టణ శివారులోని గాడిబావి శివాలయాల్లో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గాడిబావి ఆలయంలోని గర్భగుడిలో శివలింగం నాలుగు అడుగుల ఎత్తు ఉండడం ఆలయ ప్రత్యేకత. పట్టణ సమీపంలో మహాదేవుడి ఆలయం ప్రజలకు అందుబాటులో ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే రాత్రంతా జాగరణ నిమిత్తం అఖండ భజన చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వికారాబాద్: వికారాబాద్ పట్టణంలోని శ్రీ బుగ్గరామలింగేశ్వరాలయం, మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామ శివారులో ఉన్న శ్రీ పార్వతీ పరమేశ్వరుడి ఆలయాలను ఆలయ నిర్వాహకులు ముస్తాబు చేశారు.

బొంరాస్‌పేట గ్రామానికి సమీపంలోని సొరంగంలో వెలసిన శ్రీ సంగమేశ్వరుడు

11న మండల సమావేశం

ధారూరు, మార్చి7: ఈ నెల 11న ధారూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ధారూరు ఎంపీడీవో నర్సింహులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సోమవారం ఉదయం 11:30 కు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి ఆధ్వ ర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రా మాల ఎంపీటీసీలు, గ్రామ పం చాయతీ ప్రత్యే క అధికారులు, మండల స్థాయి అధికా రులు, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యు లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీవో నర్సింహులు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

జ్ఞాపికలతో ఉపాధ్యాయులు



బుట్టల్లో బంతులు వేస్తున్న మహిళా ఉపాధ్యాయులు.

బొంరాస్‌పేట, మార్చి 7 : నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలల్లో ముందుండాలని ఎంపీడీవో శ్రీదేవి, ఎంఈవో రాంరెడ్డి అన్నారు. శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళా ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఆటల పోటీలు నిర్వహించి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో పోటీ పడుతున్నారని అన్నారు. ప్రజా ప్రతినిధులుగా, అధికారులుగా మహిళలు ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో బొంరాస్‌పేట జీహెచ్ఎం హరిలాల్, చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీహరిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవీందర్‌గౌడ్, అనిల్, బాకారం చంద్రశేఖర్, గోపాల్, మహిళా ఉపాధ్యాయులు లక్ష్మి, శ్రీప్రియ, సంధ్యారాణి, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు స్థలం, నిధులు
మంజూరు చేయించండి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పరిగి, మార్చి 7 : పరిగిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు నిధులు మంజూరు చేయించాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. రాజారాం, అధ్యాపకులు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనం లేకపోవ డంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో కొనసాగుతుందని, భవన నిర్మాణానికి భూమి కేటాయింపుతోపాటు నిధులు మంజూరు చేయించాలన్నారు. స్పందిం చిన ఎమ్మెల్యే విషయా న్ని సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కా రానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ విల్సన్, అధ్యాపకులు గంగాధర్, సంపత్‌కుమార్, జె.జనార్దన్, బసప్ప, సాయిలప్ప, ఆంజనేయులు, వెంకటయ్య, సత్యనారాయణ, విజయలక్ష్మి, అంజమ్మ, నర్సింహులు, గోపాల్‌పాల్గొన్నారు.

కొడంగల్ సీఐగా శ్రీధర్‌రెడ్డి

కొడంగల్, మార్చి 7: కొడంగల్ సీఐగా శ్రీధర్‌రెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో సీఐగా విధులు నిర్వహించిన రాములు బదిలీపై హైదరాబాద్‌లోని టపాచపుత్ర పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి కొడంగల్‌కు వచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వికారాబాద్, మార్చి 7 : ఇటీవల వెలువడిన ప్రభుత్వ ఉద్యోగాల ఫలితాల్లో నాలుగు ఉద్యోగాలు సాధించిన రామయ్యగూడ పావనిని గురువారం కాలనీ వాసులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంతయ్య, ఎల్లయ్య, సురేశ్, మల్లేశం, నారాయణ, సంతోష్, శ్రీనివాస్, యాదయ్య, అశోక్, అనంతయ్య, నర్సింహులు, రమేశ్, పాండు, లక్ష్మణ్,కృష్ణ, అరుణ్ ఉన్నారు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రుణ మంజూరుపత్రాలు అందజేస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అనుప్రభ

పరిగి, మార్చి 7 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎస్‌బీఐ ఏడీబీ పరిగి చీఫ్ మేనేజర్ అనుప్రభ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్వయం సిద్ధ కింద ఆరుగురు మహిళలకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున మంజూరు చేసి గురువారం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను చీఫ్ మేనేజర్ అనుప్రభ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగితే ఆయా కుటుంబాలు ఆర్థిక పురోగతి సాధిస్తాయని చెప్పా రు. బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు వచ్చే అవకాశాలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ కాళ్లపై తాము నిలబడే స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎం రాజ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ కలీమొద్దీన్, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీశైలం వెళ్లిన శివస్వాములు

కులకచర్ల, మార్చి 7 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 41 రోజులు శివదీక్షలు పూర్తి చేసిన శివస్వాములు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున దీక్షను విరమించడానికి ఇరుముడులతో శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలివెళ్లారు.

చట్టాలపై అవగాహన

పరిగి టౌన్, మార్చి 7: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పరిగి న్యాయ మూర్తి శిల్ప సూచించారు. గురువారం పరిగి పట్టణంలోని పల్లవి కళాశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలను ఎవ్వరూ ఉల్లంఘించరాదని సూచించారు. కార్యక్రమంలో పీపీ దీపారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచంద్రయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్సై సం తోష్ కుమార్, న్యాయవాదులు నరేంద్రయాదవ్, పల్లవి విద్యా సంస్థల వైస్ చైర్మన్ దీప్తిరెడ్డి పాల్గొన్నారు.

తీర్మానం ఒక చోట..పనులు మరో చోట

పెద్దేముల్, మార్చి 7 : మండల పరిధిలోని ఖానాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్ నిబంధనలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి యశ్వంత్ తెలిపిన వివరాలు.. ఖానాపూర్ పంచాయతీకి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 5లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామంలోని జోగు రాములు ఇంటి నుంచి స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాల వరకు సీసీ రోడ్డు వేయాలని గ్రామ పంచాయతీలో తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని పట్టించుకోకుండా సదరు కాంట్రాక్టర్ వేరే చోట నుంచి పనులు చేపట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. వెంటనే నిర్మాణ పనులు ఆపకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ సిద్ధార్థను వివరణ కోరగా తీర్మానం చేసినప్పటికీ, రోడ్డు అవసరమైన చోట ప్రాధాన్యతగా మొదటగా రోడ్డు వేయాలని, మిగిలిన తర్వాత ప్రాధాన్యత ప్రదేశంలో రోడ్డు వేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించామని ఏఈ తెలిపారు.